సాక్షి
విజయనగరం
ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



ప్రైవేటు ఆస్పత్రులపై కొరడా

వైద్య ఆరోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై వైద్యాధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. - 8లో



కమనీయం కోదండరాముడి కల్యాణం

పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం బోడికొండపై ఉన్న కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 8లో



గోళ్లవలసలో గజరాజుల గుంపు

కురుపాం మండలం గుమ్మిడిగూడ పంచాయతీ గోళ్లవలస గ్రామంలో గజరాజుల గుంపు తిష్ట వేసింది. దీంతో గ్రామస్తులు భయందోళనలు చెందుతున్నారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది (సా॥)	సోమ (ఉ॥)
6:18	4:15

• నేస్తమా వెళ్లొస్తాం...



రామభద్రపురం: బూసాయవలస కేజీబీవీలో పదోతరగతి బాలికలకు వీడ్కోలు పలుకుతున్న 9వ తరగతి బాలికలు



పరీక్ష రాసి ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థినిని సాగనంపుతున్న తొమ్మిదో తరగతి బాలిక



కస్పా హైస్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



విజయనగరం నగర పాలక సంస్థకు చెందిన కస్పా స్కూల్‌లో చివరి పరీక్ష రాసాక విద్యార్థుల కేరింత

అందరూ ఏళ్లతరబడి కలసిమెలసి చదువుకున్నారు. పదో తరగతి పరీక్షలను చక్కగా రాసారు. పరీక్షలు శనివారంతో ముగియడంతో కొందరు విద్యార్థులు కేరింతలు కొట్టారు. వసతి గృహాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఇంటిబాట పట్టే సమయంలో జూనియర్ విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పారు. విడిపోతున్నామన్న బాధతో కొందరు భావోద్వేగానికి లోనయ్యారు. కన్నీటితో వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఇళ్లకు పయనమయ్యారు.

– రామభద్రపురం/ సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

న్యూస్‌రీల్

కొత్త బాధ్యతలు

- ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా రాహుల్‌దేవ్‌శర్మ



బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌దేవ్‌శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బెటాలియన్ అసోసియేషన్ ప్రతినిధులు

డెంకాడ: ఏపీఎస్పీ చింతలవలస ఐదవ బెటాలియన్ కమాండెంట్‌గా రాహుల్‌దేవ్‌శర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కమాండెంట్ కార్యాలయంలో ఆయనకు బెటాలియన్ అడిషనల్ సీహెచ్‌వీవీ పద్మనాభరాజు మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ పోలీసుల సంఘం నాయకులు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, కోరాడ రామునాయుడు, ఎం.శ్రీనివాసరావు, నాని, రమేష్ తదితరులు నూతన కమాండెంట్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడారు. కష్ట, సుఖాలను అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్ పోలీసుల సంక్షేమానికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

91 మంది గైర్హాజరు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని 127 పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన 10వ తరగతి సోషల్ పరీక్షకు 91 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 24,079 మందికి 24,040 మంది హాజరుకాగా, ప్రైవేటు విద్యార్థులు 308 మందికి 256 మంది హాజరయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి ఒక పరీక్ష కేంద్రాన్ని, డీఈఓ 6 పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 65 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు డీఈఓ వెల్లడించారు.

నోటిఫైడ్ వ్యాధుల సమాచారం అందించాలి

పార్వతీపురం టౌన్: నోటిఫైడ్ వ్యాధుల సమాచారం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి.జగన్నాథరావు కోరారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నోస్టిక్ కేంద్రాల యాజమాన్యాలతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫైడ్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, కోవిడ్, క్షయ, లెప్రసీ, మిజిల్స్, పోలియో తదితర వ్యాధులు వైద్య పరీక్షలలో నిర్ధారణ అయితే వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఆస్పత్రుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఆరోగ్య సిరి



పెదనడిపల్లి సమీపంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్ సురేష్ తదితరులు(ఫైల్)

- జిల్లాలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్
- చిరుధాన్యాలతో ఐదు రకాల ఆహార ఉత్పత్తులు
- జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో యూనిట్ నిర్వహణ
- చీపురుపల్లి మండలం పెదనడిపల్లిలో స్థలం గుర్తింపు
- ఎకరా స్థలంలో రూ.1.2 కోట్లతో డీపీఆర్ సిద్ధం
- స్థలాన్ని అప్పగిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు

<u>చీపురుపల్లి:</u>

జిల్లా ప్రజలకు ఆరోగ్య సిరి లభించనుంది. చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార ఉత్పత్తులు చౌకగా లభించనున్నాయి. ఓ వైపు ప్రజలకు బలవర్థక ఆహారం అందించడం, మరోవైపు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలోని గరివిడి, ఎస్.కోటలో ప్రారంభించిన మహిళా మార్ట్‌లు కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌ను తలపిస్తున్నాయి. అదే కోవలో చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తులు తయారు చేసి వాటిని మార్కెటింగ్ చేస్తూ మహిళల్లో ఆర్థిక పరిపుష్టిని కలిగించాలనే లక్ష్యంతో చీపురుపల్లిలోని పెదనడిపల్లి గ్రామ సమీపంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. జిల్లా సమాఖ్య సారథ్యంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది.



చిరుధాన్యాలు(ఫైల్)

జిల్లాలో 2022-23 రబీ సీజన్‌లో మండలాల వారీగా చిరుధాన్యాలు సాగు ఇలా...

మండలం	హెక్టార్లు	మండలం	హెక్టార్లు
		చీపురుపల్లి	60
రామభద్రపురం	40	గరివిడి	40
బొబ్బిలి	60	గుర్ల	100
తెర్లాం	60	మెరకముడిదాం	60
బాడంగి	40	నెలిమర్ల	40
రాజాం	740	కొత్తవలస	40
వంగర	220	జామి	20
సంతకవిటి	120	విజయనగరం	20
రేగిడి ఆమదాలవలస	140	భోగాపురం	40

సాగుకు ప్రోత్సాహం..

ప్రస్తుత కాలంలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా చిరుధాన్యాలు సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు రాయితీపై విత్తనాలు సమకూర్చుతోంది. సాగు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. పంటకు మద్దతు ధర కల్పిస్తోంది. దీంతో 2022-23 రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1843 హెక్టార్లలో చిరుధాన్యాలు సాగులో ఉన్నాయి.

ఎకరా స్థలంలో రూ.1.2 కోట్లతో యూనిట్

జిల్లాకు చెందిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చీపురుపల్లి మండలం పెదనడిపల్లిలో సర్వే నంబర్ 78/2లో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని ఏపీ ఫుడ్ కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు. ఈ స్థలంలో రూ.1.2కోట్ల వ్యయంతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఏపీ ఫుడ్ కార్పొరేషన్ అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు.

ఐదు రకాల ఆహార ఉత్పత్తులు

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి ఐదు రకాల ఆహార ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేయనున్నారు. రెడీ టు ఈట్, రా మిల్లెట్ ప్రాసెసింగ్, కుర్‌కురే, న్యూడిల్స్, మిల్లెట్ బేకరీ వంటి ఆహార ఉత్పత్తులు తయారు చేస్తారు. వాటిని ప్యాకింగ్ రూపంలో సిద్ధంచేసి మార్కెట్‌లోకి పంపిస్తారు.

జిల్లా సమాఖ్య ద్వారా నిర్వహణ

ప్రభుత్వ స్థలంలో, ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేయనున్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా సమాఖ్య ద్వారా నిర్వహించనున్నారు. స్వయం సహాయక సంఘాలకు యూనిట్ బాధ్యతలు అప్పగించి తద్వారా వచ్చే ఆదాయాన్ని మహిళలే తీసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అదే కోవలో ఇప్పటికే గరివిడి, ఎస్.కోట మండలాల్లో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసి ఆయా మండలాల్లో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ప్రతీ మహిళను ఆ మార్ట్‌లకు యజమానులను చేసింది.

యూనిట్ ఏర్పాటుకు చర్యలు



జిల్లాకు సంబంధించిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను చీపురుపల్లి మండలం పెదనడిపల్లి గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పెదనడిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 78/2లో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. రెవెన్యూ శాఖ అధికారులు స్థలాన్ని అప్పగించారు. త్వరలోనే యూనిట్ ఏర్పాటుచేసి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తాం. బయటమార్కెట్ కంటే తక్కువ ధరకే లభించనున్నాయి.

– కళ్యాణ్ చక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం

జన నినాదంగా... 'మా నమ్మకం నువ్వే జగన్'



జెడ్పీ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సాగుతున్న పీపుల్స్ సర్వేకు అనూహ్య స్పందన
- జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 65 శాతం సర్వే పూర్తి
- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రభుత్వ పాలనపై విశ్వాసం వ్యక్తం చేసిన వారి ఇళ్లకే స్టిక్కర్లు
- స్టిక్కర్లు పెట్టుకోకుంటే పథకాలు ఆపేస్తారంటూ వస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దు
- త్వరలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి శ్రీకారం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' అన్నది జన నినాదం. సంక్షేమ, అభివృద్ధి పాలనపై ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం సేకరిస్తున్నాం... అధికారంలో ఉంటూ పాలనపై ప్రజాభిప్రాయాలు తెలుసుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. రాజకీయాలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా, అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం వల్లే ప్రజల సంపూర్ణ మద్దతుతో జిల్లాలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు స్పష్టంచేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న ప్రారంభించిన మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకు సాగుతుందన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతి కుటుంబాన్ని కలిసి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. ప్రజలకు సంతృప్తికర పాలన అందించడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని తెలిపారు. పాలనపై సంతృప్తి కనబరిచిన వారు సెల్: 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయడం ద్వారా వారి అభిప్రాయాన్ని నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 65 లక్షల కుటుంబాలు మిస్‌డ్‌కాల్ ఇచ్చి సంక్షేమ పాలనపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశాయన్నారు. జిల్లాలోని 607 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 65 శాతం సర్వే పూర్తయిందని, ఈ నెల 20లోగా శతశాతం పూర్తిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకుంటున్న కుటుంబాల ఇష్టప్రకారమే వారి ఇళ్లకు ' మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికిస్తున్నామని స్పష్టంచేశారు.

ప్రతి కుటుంబంతో 20 నిమిషాలు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న మెగా పీపుల్స్ సర్వేలో భాగంగా ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి 20 నిమిషాల సమయం ఒక్కో కుటుంబంతో మాట్లాడి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తేడాను వివరిస్తున్నట్టు తెలిపారు. 2019 ఎన్నిలకు ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో గత టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీల దోపిడీ పాలన నుంచి ప్రజలకు విముక్తికలిగిందన్నారు.

పథకాల తొలగింపు మా విధానం కాదు...

మెగా పీపుల్స్ సర్వేలో అసంతృప్తి వ్యక్తం చేసిన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలను నిలిపివేయడం తమ విధానం కాదని మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అలా అయితే గడిచిన నాలుగేళ్లలో రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని హితవుపలికారు. సర్వేలో గుర్తించిన సమస్యలు పరిష్కారం కాకుంటే త్వరలో చేపట్టనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలే నేరుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. రానున్న 2024 ఎన్నికల నాటికి ప్రజలందరి సంతృప్తే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలు ఉంటాయని, మరల రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని దీవించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. సమావేశంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శిరువూరి వెంకటరమణ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.కస్తూరి, జామి జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు మస్తర్లు వేయొద్దు

- కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధి హామీ పనుల్లో తప్పుడు మస్తర్లు వేయొద్దని, పారదర్శకంగా పనులు నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. వేతనదారులు, సిబ్బందితో మాట్లాడారు. పనుల నిర్వహణపై ఆరా తీశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, రెండు పూటలా పనులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల ప్రాంతంలో మెడికల్ కిట్ ఉంచాలని సూచించారు. కొలతలు ప్రకారం పనులు చేసి గిట్టుబాటు వేతనం పొందాలని, ఉపాధి హామీ పనులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హౌసింగ్ లేఅవుట్ పరిశీలన

గరివిడి మండలం కోడూరులోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షల తీరుపై చీఫ్ సూపరింటెండెంట్ భానుమతిని ప్రశ్నించారు. అలాగే, జగన్నాథపురంలో భూ సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలపై ఆరా తీశారు. ఆమె వెంట ఆర్డీఓ అప్పారావు, తహసీల్దార్ టి.గోవింద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎన్.కష్టారావు, పీడీ ఉమామహేశ్వరి, ఏపీడీ లక్ష్మణరావు, ఏపీఓ రత్నమాల, హౌసింగ్ డీఈ గౌరీశంకర్, ఏఈ శివసాగర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గరివిడి మండలం కొండలక్ష్మీపురంలో ఉపాధిహామీ వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి సంగువారి మెట్టపై ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేవారికి ప్రతీ రెండు నెలలకోసారి బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. నిర్మాణాలు ప్రారంభించని వారి స్థలాలు రద్దుచేసి కొత్తవారికి కేటాయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.అప్పారావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి కె.రాజ్‌కుమార్, హౌసింగ్ డీఈ గౌరీశంకర్, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎంపీ 'బెల్లాన' కృషి

- వారణాశి రైలుకు జిల్లాలో హాల్ట్ సౌకర్యం

<u>చీపురుపల్లి:</u>

జిల్లాలోని భక్తులు, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చేసిన కృషి ఫలించింది. విశాఖపట్టణం నుంచి వారణాశికి వెళ్తున్న 08588 నంబర్ గల రైలుకు జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం రైల్వే స్టేషన్‌ల్లో హాల్ట్ సౌకర్యం కలిగింది. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి అత్యధికమంది భక్తులు శివ దర్శనం కోసం వారణాశి వెళ్తున్నారని, విశాఖపట్టం నుంచి బయలుదేరే రైలుకు విజయనగరం జిల్లాలో హాల్ట్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పార్లమెంటులో ప్రస్తావించారు. దీనిపై రైల్వే మంత్రి, అధికారులు స్పందించి హాల్ట్ సదుపాయం కల్పించారు. ఏప్రిల్, మే నెలల్లో వారణాశిలో పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో కాశీ వెళ్లే జిల్లా భక్తులకు రైలు సదుపాయం అక్కరకు వచ్చింది.

క్లుప్తంగా

గొల్లవలసలో గజరాజుల గుంపు



గొల్లవలస గ్రామంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కురుపాం: మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ గొల్లవలస గ్రామంలో గజరాజులు గుంపు తిష్ట వేసింది. దీంతో గ్రామస్తులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొమరాడ మండలం నుండి శుక్రవారం అర్ధరాత్రి కురుపాం మండలం గొల్లవలస గ్రామంలోకి మొత్తం ఏనుగుల గుంపు ప్రవేశించి పంటలు ధ్వంసం చేసాయని గ్రామస్తులు తెలిపారు. అర్ధరాత్రి గ్రామంలోకి రావడంతో బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నిద్ర లేకుండా గడిపినట్లు గ్రామస్తులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి గ్రామ పరిసరాల నుండి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి

పార్వతీపురం: నిద్రిస్తున్న వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి అవుట్ పోస్టు పోలీసులు శనివారం తెలిపిన వివరాలు... వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన బొత్స శివప్రసాద్‌ను శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కె.గౌరీ శంకరరావు అకారణంగా కొట్టాడు. ఈ ఘటనలో శివప్రసాద్‌కు తల, ఎడమ చెంప, ఎడమ కాలుపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



శ్రీలక్ష్మి మృతదేహం

రాజాం సిటీ: స్థానిక కాలెపువీధిలో నివాసం ఉంటున్న పడాల శ్రీలక్ష్మి (28) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి శనివారం కేసు నమోదు చేసిన ఎస్‌ఐ నీలావతి వివరాలు వెల్లడించారు. విజయనగరానికి చెందిన శ్రీలక్ష్మి 10వ తరగతి వరకు చదువుకుని డ్యాన్స్ ఈవెంట్‌లకు యాంకర్‌గా వ్యవహరించేది. ఈ క్రమంలో రాజాంకు చెందిన డ్యాన్సర్ పడాల రాజుతో పరిచయం ఏర్పడింది. ఇది కొన్నేళ్లకు ప్రేమగా మారి గత ఏడాది జూలైలో ఇరువురు వివాహం చేసుకుని రాజాంలో నివాసం ఉంటున్నారు. అప్పటి నుంచి ఎంతో అన్యోన్యంగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అశోక్ డ్యాన్స్ ప్రోగ్రాంల నిమిత్తం వెళ్లి ఆలస్యంగా రావడం నిర్లక్ష్యం చేస్తున్నాడనే అభద్రతా భావానికి లోనైంది. ఈ క్రమంలో ఈ నెల 14న అర్ధరాత్రి దాటిన తరువాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన భర్త తన స్నేహితుని సహాయంతో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నాగావళి నదిలో మృతదేహం లభ్యం



నాగావళి నదిలో తేలియాడుతున్న మిరియాల సింహాచలం మృతదేహం

వంగర: మండలంలోని పెదరాజులగుమ్మడ గ్రామానికి చెందిన మిరియాల సింహాచలం (66) మృతి చెందాడు. ఆయన మృతదేహం గ్రామ సమీపంలోని ఓడరేవు వద్ద ఉన్నట్లు స్థానికులు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని నాగావళి నది నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. పెదరాజులగుమ్మడ గ్రామానికి చెందిన మిరియాల సింహాచలంగా గుర్తించారు. ఈ నెల 14వ తేదీ ఉదయం నుంచి తన భర్త కనిపించలేదని, స్నానానికి దిగి ఈత రాకపోవడంతో ఇలా నదిలో కొట్టుకుపోయి మృతి చెంది ఉంటాడని మృతుడు భార్య సరోజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్నట్లు చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	55,950–00
బంగారం(22కి. 10గ్రా.)	61,040–00
వెండి (కిలో)	81,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

ప్రైవేటు ఆస్పత్రులపై కొరడా

- రిజిస్ట్రేషన్ లేకుంటే కఠిన చర్యలు
- వైద్య శాఖ అనుమతి లేని రెండు క్లినిక్‌లకు నోటీసుల జారీ
- జిల్లాలో రిజిస్టర్ అయిన ప్రైవేటు ఆస్పత్రులు 307
- ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 91
- ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు 14

వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా నిర్వహించే ప్రైవేటు క్లినిక్‌లు, స్కానింగ్ కేంద్రాలు, లాబొరేటరీలపై సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమతి లేని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. అలాగే రెన్యువల్ చేసుకోని వారికి కూడా నోటీసులు ఇస్తున్నారు. తద్వారా ప్రజారోగ్యానికి భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టారు.



పట్టణంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై వైద్యాధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. వైద్య శాఖ అనుమతి తీసుకోవాలని పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోకుండా క్లినిక్‌లు, ఆస్పత్రులు నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. రెన్యువల్ చేయించుకోని ఆస్పత్రులకు కూడా రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు ఇస్తున్నారు. దీంతో రెన్యువల్ చేయించుకోవడానికి, రిజిస్టర్ చేసుకోవడానికి ఆస్పత్రులు ముందుకు వస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆస్పత్రులతో పాటు లాబొరేటరీలు కూడా ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. వీరిలో కొందరు అనుమతులు తీసుకుంటుంటుగా, కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన ఆస్పత్రుల వివరాలు

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ వద్ద ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు 120 రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్లినిక్‌లు 80 రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. డయోగ్నోస్టిక్ సెంటర్లు 51 ఉన్నాయి. డెంటల్ క్లినిక్‌లు 48 ఉన్నాయి. ఫిజియోథెరపి క్లినిక్‌లు 8 ఉన్నాయి. అదేవిధంగా ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు 91 ఉన్నాయి. ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లు 14 ఉన్నాయి. ఇవన్నీ రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. రిజిస్ట్రేషన్ లేకుండా ఇంకా కొందరు ఆస్పత్రులు, క్లినిక్‌లు, లాబొరేటరీలు నిర్వహిస్తున్నారు. వీరిపై చర్యలకు అధికారులు ముందడుగు వేశారు.

వైద్య శాఖలో రిజిస్ట్రేషన్ ఫీజుల వివరాలు

క్లినిక్ అయితే ఏడాదికి రూ.250 చొప్పున ఐదేళ్లకు సరిపడ ఫీజు రూ.1250 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాలీ క్లినిక్ అయితే ఐదేళ్ల రూ.2500 ఫీజు చెల్లించాలి. లాబొరేటరీలు అయితే ఏడాదికి రూ.500 చొప్పున ఐదేళ్లకు రూ.2500 చొప్పున చెల్లించాలి. నర్సింగ్ హోంలు రూ.750 చొప్పన ఐదేళ్లుగా రూ.3750 చెల్లించాలి. 20 పడకలు ఉంటే ఏడాదికి రూ.1500 చొప్పున ఐదేళ్లకు రూ.7500 చెల్లించాలి. 50 పడకలు దాటితే ఏడాదికి రూ.రెండు వేలు చొప్పున ఐదేళ్లకు రూ.పది వేలు చొప్పున చెల్లించాలి.

అనుమతులు ఉండాల్సిందే..

వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా ఆస్పత్రులు, క్లినిక్‌లు, లాబొరేటరీలు నిర్వహించడానికి లేదు. అటువంటి రెండు క్లినిక్‌లకు నోటీసులు ఇచ్చాం. రెన్యువల్ చేసుకోని వారికి కూడా రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు జారీ చేశాం. ఆన్‌లైన్ ద్వారా వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

– డాక్టర్ ఎస్‌వీరమణకుమారి, డీఎంహెచ్‌ఓ

సమ సమాజ నిర్మాణమే అంబేడ్కర్ లక్ష్యం



జ్ఞాపికలతో నృత్య ప్రదర్శన విద్యార్థులు

విజయనగరం అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లక్ష్యం సమ సమాజ నిర్మాణమని, దాన్ని దేశానికి ఆయన రచించిన రాజ్యాంగం ద్వారా ప్రపంచానికి తెలియజేశారని ప్రముఖ సాహితీవేత్త జీఎస్‌చలం అన్నారు. గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు సంబంధించిన శనివారం జరిగిన సదస్సులో పలువురు వక్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వేదాలను, పురాణాలను ఉదహరిస్తూ వాగ్గేయకారుడు అన్నమయ్య కీర్తనలలో సహితం అన్ని జీవులు సమానం అని చెబుతాయని అన్నారు. పోతులూరి వీరబ్రహ్మం కాళికాంబ శతకంలోనూ వేమన తన పద్యాలలోనూ కుల, మత వివక్షలను ఖండించారని అన్నారు. గురజాడ విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు కె.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఇండియన్ సైకాలజిస్టు అసోసియేషన్ సహాధ్యక్షుడు డాక్టర్ ఏవీ రాజశేఖర్, పలువురు ఉపాధ్యాయులు చుక్క తిరుపతినాయుడు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలిత గాజులరేగ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన లఘు నాటికలు, 'బ్రహ్మ మొక్కటే... పర బ్రహ్మమొక్కటే...' అనే నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళా ప్రదర్శనలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

మద్యం సీసాల సీజ్



మద్యం సీసాలను సీజ్ చేసిన ఎస్‌ఐ గంగరాజు



మద్యం బాటిళ్లు, పట్టుబడిన వ్యక్తులతో పోలీసులు

గజపతినగరం: మండలంలోని పాతశ్రీరంగరాజపురం గ్రామంలో అక్రమంగా మద్యం సీసా లు విక్రయిస్తున్న వి.తౌడమ్మను అదుపులోకి తీసుకొని కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ గంగరాజు విలేకరులకు శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం వ్యాపారాలు చేసినా, పేకాట, కోడి పందాలు, బెట్టింగ్‌లు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో నిఘా పెట్టి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు బుక్ చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

మెంటాడ: మండలంలోని గుర్ల, తమ్మిరాజుపేట గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం తరలిస్తుండగా శుక్రవారం రాత్రి పట్టుకున్నట్టు ఆంధ్ర ఎస్‌ఐ సిద్దార్థ శనివారం తెలిపారు. పిట్టాడ కూడలి వద్ద 15సీసాలతో, తమ్మిరాజుపేట కూడలి వద్ద 10 సీసాలతో ఇద్దరు వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: పట్టణ పరిధి వస్త్రపురి కాలనీ, మెంటిపేట కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్టు చేశామని టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి వారి నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.

నేవీ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

విజయనగరం క్రైమ్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక నేవీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఇండియన్ నేవీలో ఉద్యోగం చేస్తున్న కె.శ్రీనివాసరావు (27) రెండు రోజులుగా విధులకు సెలవు పెట్టి జొన్నవలసలో తన స్వగృహం వద్దనే ఉన్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఉపాధి కూలీలు. శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకూ బాగానే ఉన్నాడు. కూలి పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉండడంతో పలుమార్లు పిలిచినప్పటికీ పలకకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆర్థిక ఇబ్బందులు, గత కొంత కాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడని తల్లిదండ్రులు పోలీసులకు వివరించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. తండ్రి కెంగువ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు.

సైబర్ నేరానికి పాల్పడిన ముగ్గురి అరెస్టు



సైబర్ నేరగాళ్లను విలేకరుల ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

- గతంలో ఒకరి అరెస్టు– రూ.4.60 లక్షల నగదు రికవరీ

రాజాం సిటీ: సైబర్ నేరానికి పాల్పడిన వ్యక్తులను సంతకవిటి పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి వారి నుంచి నగదు రికవరీ చేశారు. శనివారం సైబర్ నేరగాళ్లను విలేకరుల ఎదుట హాజరుపరుస్తూ దీనికి సంబంధించిన వివరాలను రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర వెల్లడించారు. గత ఏడాది జూలై నెలలో జీఎంఆర్ ఐటీలో ఉద్యోగం చేస్తున్న ప్రొఫెసర్ సైబర్ నేరగాళ్ల వలలో పడి ఏకంగా రూ. 5.09 లక్షలు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. రాజాంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న ప్రొఫెసర్ నేరగాళ్లు మెయిన్‌ను యాక్ చేశారు. దీని ద్వారా తన యాక్సిస్ బ్యాంకుకు లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే బ్యాంకు అధికారులు సైతం లోన్‌ను మంజూరు చేయడంతో తన ఫోన్‌కు రూ. 4.90లక్షలు రుణం మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. ఇది చూసి విస్తుపోయిన తను లోన్‌కు దరఖాస్తు చేయకుండానే ఎందుకు వచ్చిందని అదే నంబర్‌కు ఫోన్ చేశాడు. మీకు ఓటీపీ పంపిస్తామని అది చెబితే మీ రుణాన్ని రద్దు చేస్తామని చెప్పిన సైబర్ నేరగాళ్లు ఏకంగా ప్రొఫెసర్ ఖాతాలో నుంచి లోన్ రుణం రూ.4.90 లక్షలతో పాటు అతని సొంత సొమ్ము రూ.19వేలతో కలిపి రూ. 5.09 లక్షలు మాయం చేసి వేర్వేరు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన ప్రొఫెసర్ సోల్మాన్ సంతకవిటి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో సైబర్ నేరగాళ్లు ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ జిల్లా బుధాన్ మండలం బుదవరా గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులుగా గుర్తించారు. వీరిలో ఒక వ్యక్తి ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేసిన సుమిత్ అనే వ్యక్తిని అరెస్టు చేసి మిగిలిన వారి వివరాలు ఆరా తీశామని అన్నారు. అదే గ్రామానికి చెందిన సచిన్‌కుమార్, మనీష్ కుమార్, రవికుమార్‌లతో కలసి ఈ నేరం చేశామని సుమిత్ కుమార్ తెలిపాడని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సదరు ముగ్గురు వ్యక్తులు గ్రామం నుంచి పరారైనట్లు గుర్తించినప్పటికీ వారిపై నిఘా ఉంచామని వెల్లడించారు. గ్రామంలోని వ్యక్తుల ద్వారా వారి వివరాలు సేకరించి ఈ నెల 10న ఉత్తరప్రదేశ్ వెళ్లి వారి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి నేరంలో పోయిన రూ. 4.69 లక్షలకు రూ. 4.60 లక్షలు రికవరీ చేశామని చెప్పారు. గతంలో రూ. 5.09 లక్షలు పోయినప్పటికీ రూ. 40వేలు మళ్లీ ప్రొఫెసర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. నేరస్తులు పట్టుకోవడానికి కృషి చేసిన ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు, కానిస్టేబుల్ వై.రామరాజు, నర్సింగరావులను అభినందించారు.

గోదాం అప్పగింత

పూసపాటిరేగ: అక్రమ నిర్మాణమంటూ రెండేళ్ల కిందట అధికారులు కూల్చేసిన హెచ్‌పీ గ్యాస్ గోదామును కోర్టు ఆదేశాలతో తిరిగి నిర్మించి అప్పగించారు. తహసీల్దార్ ఇ.భాస్కరరావు, రాజాం తహసీల్దార్ పి. విజయభాస్కర్ సమక్షంలో గోదాం తాళాలను యజమానికి శనివారం అందజేశారు. గోదాం అక్రమ నిర్మాణమంటూ రెండేళ్ల కిందట అధికారులు కూల్చివేశారు. దీంతో గోదాం యజమాని కోర్టును ఆశ్రయించడంతో.. న్యాయమూర్తి ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దార్ విజయ్‌భాస్కర్ సొంత నిధులతో గోదాం నిర్మించారు. ఎస్సై ఎ.నరేష్, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, పాల్గొన్నారు.

సీనియర్స్, అండర్ -23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక రేపు

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు

విజయనగరం: విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న సీనియర్స్, అండర్ – 23 విభాగాల్లో జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్‌ఎన్ రాజు శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు విజయనగరంలోని సర్ విజ్జి స్టేడియంలో ఎంపిక పోటీలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో పాటు విజయనగరం జిల్లాలో జన్మించినట్లు జనన ధ్రువీకరణ పత్రం, విజయనగరం జిల్లాలో చదువుతున్నట్లు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ వెంట తీసుకురావాలని సూచించారు. అండర్ – 23 ఎంపికకు హాజరయ్యే అభ్యర్థులు 2000 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని మరిన్ని వివరాలకు 9666818126 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

కమనీయం కోదండరాముడి కల్యాణం



సీతారామస్వామికి తలంబ్రాల సేవను జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం బోడికొండపై కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా దేవస్థాన అర్చకులు శనివారం స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమోక్తంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా కోదండ రాముడికి ప్రాతఃకాల పూజలు చేపట్టిన అనంతరం ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అష్ట కలశ స్నపన మహోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం సీతారామస్వామిని పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి కల్యాణ ఘట్టాన్ని ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ జీలకర్ర, బెల్లం చూపించి.. స్వామి కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. అనంతరం కర్పూర దండలను అలంకరించి తలంబ్రాల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోగొట్టుకున్న కెమెరా అందజేసిన పోలీసులు



రమేష్‌కు కెమెరాను అందజేస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు

విజయనగరం క్రైమ్: స్థానిక ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ కెమెరామెన్‌గా పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్న ఆడారి రమేష్ కళాశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఐనాడ జంక్షన్ వద్ద ఆటో ఎక్కి ఆటోలో రూ.లక్ష విలువైన తన కెమెరాను మర్చిపోయారు. తర్వాత కెమెరా మర్చిపోయానని గుర్తించిన రమేష్ వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ టివి.తిరుపతిరావు, ఎస్‌ఐ బి.గణేష్, కానిస్టేబుల్ రామ్మోహన్‌తో కలిసి సీసీ పుటేజ్‌లు తనిఖీ చేసి ఆటోను గుర్తించి కెమెరాను కనిపెట్టారు. ఈ మేరకు శనివారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో రమేష్‌కు కెమెరాను అందజేశారు. దీంతో రమేష్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి విజయనగరం

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



ఫుడ్ కమిషన్ సభ్యుడి సుడిగాలి పర్యటన

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సరఫరా చేస్తున్న గుడ్ల తూకంలో తేడాలపై ఫుడ్ కమిషన్ రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశంలో ప్రస్తావిస్తానని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు యాదవ్ అన్నారు.

- 8లో



వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఆయా కుటుంబాల్లో విషాదం అలముకుంది.

- 8లో



స్వధార్ హోం నుంచి ఇద్దరు అమ్మాయిల పరారీ

పట్టణంలోని స్వధార్ హోంలో ఉంటున్న ఇద్దరు అమ్మాయిలు పరారయ్యారు.

- 8లో



న్యూస్‌రీల్

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉన్నాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి



విజయనగరం ఫోర్ట్: కోవిడ్ ఫోర్త్ వేవ్ వ్యాప్తి నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి గురువారం తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. రోజుకి 200 మందికి కోవిడ్ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఉన్న 48 పీహెచ్‌సీలు, జిల్లా కేంద్రంలో ఉన్న 11 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డయాలసిస్ రోగులు, కాలేయం మార్పిడి చేసుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కోవిడ్ భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని కోరారు. ఫంక్షన్లు, షాపింగ్ మాల్స్, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం మంచిదని తెలిపారు.

ప్రశాంతంగా సైన్స్ పరీక్ష

- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒకరు డీబార్

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని 127 కేంద్రాల్లో గురువారం పదోతరగతి సైన్స్‌పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రెగ్యులర్ విద్యార్థులు 24,076 మందికి 24,039 మంది, ప్రైవేటు విద్యార్థులు 1406 మందికి 1346 మంది హాజరయ్యారు. స్క్వాడ్ బృందాలు 63 పరీక్ష కేంద్రాలను, డీఈఓ 4, జిల్లాస్థాయి పరిశీలకులు 4 కేంద్రాలను తనిఖీ చేశారు. చీపురపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని డీబార్ చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

26న క్యాంపస్ డ్రైవ్

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ), హెచ్‌సీఎల్ టెక్నాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తోటపాలెంలో ఉన్న ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో ఈ డ్రైవ్ సాగుతుందన్నారు. హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఇంటర్మీడియట్ 2022, 2023 సంవత్సరాల్లో 75 శాతానికి పైగా మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ముందుగా హెచ్‌సీఎల్ టెక్‌బీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 94929 27844, 63015 74739 నంబర్లను సంప్రదించాలన్నారు.

సంస్కృత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మృతి



యనమండ్ర సూర్యనారాయణ (ఫైల్)

విజయనగరం టౌన్: ఋగ్వేదాచార్యులు, మహారాజా సంస్కృత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ యనమండ్ర సూర్యనారాయణ అవధాని బుధవారం రాత్రి అన్నవరంలో శివైక్యం పొందారు. ఈ మేరకు ఆయన శిష్యబృందం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వందలాది మంది శిష్యులు అన్నవరం వెళ్లి సంతాపం తెలియజేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో శిష్యులు దూసి శివప్రసాద్, శంబర కృష్ణ తదితరులున్నారు.

ముగిసిన కౌన్సెలింగ్

విజయనగరం పూల్‌బాగ్: డీఎస్సీ–1998 అభ్యర్థుల నియామకాలకు సంబంధించిన కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 489 మందికి బుధవారం 475 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. గురువారం మరో 14 మంది హాజరైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. అందరికీ నియామక పత్రాలు అందజేశామన్నారు.

18న సీజీఆర్‌ఎఫ్ సదస్సు

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న గజపతినగరంలో సదస్సు నిర్వహిస్తామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోదండ రామునికి చక్కని కోవెల

- రామతీర్థం శ్రీకోదండ రామాలయ నిర్మాణం పూర్తి
- చెప్పిన మాట ప్రకారం క్లిష్ట పరిస్థితుల్లోనూ శరవేగంగా పనులు
- ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూ.4 కోట్ల నిధులు
- రూ.3 కోట్ల వ్యయంతో బోడికొండపై నిర్మాణాలు పూర్తి
- దిగువనున్న ప్రధాన ఆలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు
- ప్రతిష్టాపన తర్వాత రేపు ప్రథమ వార్షికోత్సవం



కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలు



నాడు: ఈ చిత్రం చూశారా... 2014 సంవత్సరంలో రామతీర్థంలోని నీలాచలమనే బోడికొండపైనున్న శ్రీ కోదండ రాముని ఆలయమే ఇది! నాటి చంద్రబాబు పాలన సమయంలో 2014 అక్టోబర్ 12వ తేదీన హుద్‌హుద్ తుపాను ధాటికి రామాలయం కూడా దెబ్బతిన్నది. ప్రహరీ అంతా కూలిపోయింది. ధ్వజస్తంభం నేల కొరిగింది. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ నాయకుడు పూసపాటి అశోక్‌గజపతిరాజే ఈ ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్త కూడా. ధ్వజస్తంభం లేకుండానే ఆలయంలో స్వామివారికి నిత్య కైంకర్యాలు కొనసాగించడంపై అప్పట్లో హిందూ మత సంఘాలు పెద్దఎత్తున నిరసన తెలిపాయి. అయినా చంద్రబాబు ప్రభుత్వం కోదండరాముడి ఆలయాన్ని బేఖాతరు చేసింది.



నేడు: 2023 సంవత్సరంలో నేటి చిత్రం ఇది. చెప్పిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునర్నిర్మించిన శ్రీ కోదండరామాలయం ఇది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో భారీగా నిధులు మంజూరయ్యాయి. క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రత్యేక నిపుణులు, ఆగమ శాస్త్ర పండితుల పర్యవేక్షణలో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేయించారు. గర్భాలయం తరువాత అర్ధ మండపం, ముఖ మండపాలు రూపుదిద్దుకున్నాయి. ధ్వజస్తంభం పునరుద్ధరించారు. ప్రహరీ పూర్తయింది. గతంలో మాదిరి దుర్ఘటనలేవీ పునరావృతం గాకుండా సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రామతీర్థం... ఉమ్మడి విజయనగరం జిల్లా వాసులే కాదు.. ఉత్తరాంధ్ర, ఒడిశాలోని ఆంధ్రా సరిహద్దు జిల్లాల ప్రజలు దర్శించుకునే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. స్వయంగా శ్రీరాముడే నడయాడిన ప్రదేశమని వారి విశ్వాసం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం తర్వాత అంతటి స్థలప్రాశస్త్యం ఉంది కాబట్టే ఇది రెండో భద్రాద్రిగా పేరుగాంచింది. శతాబ్దాల కిందట నిర్మించిన ఈ ఆలయ విశిష్టతను చాటే శిలాశాసనాలు, చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. దిగువనున్న శ్రీరాముని ప్రధాన ఆలయమే గాకుండా బోడికొండపై శ్రీకోదండరాముడి కోవెలకూ ఘన చరిత్ర ఉంది. ఏకశిలా పర్వతమైన ఆ నీలాచలం కొండపై శతాబ్దాల కిందటే ఆలయాన్ని నిర్మించారు. రామతీర్థం వచ్చిన భక్తులు దిగువన ఉన్న ప్రధాన ఆలయాన్ని సందర్శించిన తర్వాత ఈ కోదండరాముడినీ దర్శించుకుంటారు.

హుద్‌హుద్ తుపానుతో ధ్వంసం

హుద్‌హుద్ తుపాను ధాటికి కోదండరాముడి ఆలయం దెబ్బతింది. ప్రహరీ కూలిపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం దీన్ని బాగుచేయకపోవడంతో ఆలయానికి రక్షణ కరువైంది. ఫలితంగా మూడేళ్ల కిందట జరిగిన దారుణం జిల్లా ప్రజలను కలచివేసింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అప్పటివరకూ ఆలయాన్ని విస్మరించిన టీడీపీ నాయకులు... ఈ దుర్ఘటనను మాత్రం ఎప్పటిలాగే రాజకీయాలకు వాడుకోవడానికి విఫల యత్నం చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రామతీర్థం ఘటనను సీరియస్‌గా తీసుకుంది. దుర్ఘటనపై ఒకవైపు దర్యాప్తు చేయిస్తూనే మరోవైపు ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టింది. రూ.3 కోట్ల నిధులను కేటాయించింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో సీతాసమేత శ్రీరాముడి కొత్త విగ్రహాలను తయారుచేయించింది. ఆ వెంటనే దిగువనున్న బాలాలయంలో స్వామి ధ్రువ మూర్తులను శాస్త్రోక్తంగా ప్రతిష్ట చేయించింది. ఆలయ నిర్మాణం పూర్తి అయిన వెంటనే గత ఏడాది ఏప్రిల్ 15వ తేదీన పునఃప్రతిష్ట చేయించింది. ఈనెల 15వ తేదీన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణం

ఆలయానికి శిలాఖండాలను బోడికొండపైకి చేర్చడం చాలా కష్టమైన ప్రక్రియ. ప్రత్యేకంగా ట్రాక్ వేసి ఒక్కొక్కటిగా కొండపైకి తీసుకెళ్లారు. చిత్తూరు జిల్లా కుప్పం, తమిళనాడు రాష్ట్రంలోని మధురైకు చెందిన 20 మంది కార్మికుల శ్రమతో కోదండరామునికి చక్కని కోవెల రూపుదిద్దుకుంది. విజయవాడలో ప్రత్యేకంగా తయారుచేయించిన ధ్వజస్తంభాన్ని శాస్త్రయుక్తంగా పునఃప్రతిష్ఠించారు. రూ.3 కోట్ల వ్యయంతో రామాలయంతో పాటు యాగశాల, వంటశాల, స్టోర్ రూమ్, ప్రహరీ కూడా నిర్మించారు. కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం కొండ పైకి మెట్లను పునర్నిర్మించారు.

స్వామివారికి సుందరమైన ఆలయం



శ్రీకోదండరాముడికి చక్కని ఆలయం మళ్లీ సాకారమైంది. ఆగమ శాస్త్రం ప్రకారం పునఃప్రతిష్ట చేయించాం. స్వామికి నిరాటంకంగా నిత్య కైంకర్యాలను జరిపిస్తున్నాం. భక్తులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రతిష్టాపన తర్వాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నాం.

– సాయిరామాచార్యులు, ప్రధాన అర్చకుడు

రామతీర్థం అభివృద్ధి వైఎస్ కుటుంబం ఘనత



రామతీర్థం అభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిధులు ఇచ్చారు. వాటితో పలు అభివృద్ధి పనులు చేయించాం. మళ్లీ ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే భారీగా నిధులు కేటాయించారు. బోడికొండపై శిథిలమైన శ్రీకోదండరామ ఆలయాన్ని రూ.3 కోట్లతో నిర్మించారు. దిగువనున్న ప్రధాన ఆలయ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేశారు. మొత్తం రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన ఒక్క పని కూడా ఇక్కడ కనిపించదు.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే

ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనులు

రామతీర్థం ప్రధాన ఆలయ అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఆలయంలో శిథిలమైన ఫ్లోరింగ్‌ను తొలగించి కొత్తగా నిర్మించనున్నారు. యాగశాలకు శాశ్వత నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఉత్తర రాజగోపురం వద్ద సుందరీకరణ చేయనున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. ఈనెలాఖరులోగా పనులు ప్రారంభిస్తామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

- జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు



నెల్లిమర్ల:

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 16వ తేదీన రాతపరీక్ష జరగనుందని గురుకులాల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. జిల్లాలోని నెల్లిమర్ల, విజయనగరం, గంట్యాడ, కొత్తవలస, గజపతినగరం, బొబ్బిలి ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులంతా ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. ఇప్పటికే హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్లో అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు హెచ్‌టీటీపీ://బీఐటీ.ఎల్‌వై/ఎంజేపీఏపీ బీసీవెల్ఫేర్‌ఫిఫ్త్‌క్లాస్‌హాల్‌టిక్కెట్స్2023 అనే లింక్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఏడు పాఠశాలల్లో ప్రవేశాలకు మొత్తం 1150 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు. 440 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

నెల్లిమర్ల బాలికల పాఠశాలకు 191 మంది, మత్స్యకార బాలుర పాఠశాలకు 18 మంది, గజపతినగరం బాలుర పాఠశాలకు 145 మంది, విజయనగరం బాలుర పాఠశాలకు 90 మంది, బొబ్బిలి బాలుర పాఠశాలకు 227 మంది, గంట్యాడ బాలికల పాఠశాలకు 199 మంది, కొత్తవలస బాలికల పాఠశాలకు 280 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లోనే ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు.

పోలీసులకు సేవా పతకాలు



సీహెచ్ లక్ష్మణరావు



బి.వెంకటరావు



అనంతరామ్ పండా



ఎస్.విశ్వనాథం

విజయనగరం క్రైమ్: ఉత్తమ సేవలందిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు–2023కు ఎంపికచేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. విజయనగరం జిల్లా టూటౌన్ సీఐగా పనిచేస్తున్న సీహెచ్.లక్ష్మణరావుకు ఉత్తమ సేవా పతకం, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావుకు సేవాపతకం, ఏఆర్ ఎస్‌ఐ అనంతరామ్‌పండా, బూర్జువలస హెచ్‌సీ ఎస్.విశ్వనాథం, 5వ బెటాలియన్‌కు చెందిన బీఎస్‌సీ శేఖర్‌రావు, ఎఆర్ ఎస్‌ఐలు ఆర్.మోహన్, పి.ఎస్.భానేశ్వరరావు, ఆంధ్ర ఎఎస్‌ఐ బి.వి.రమణ, పాలకొండ హెచ్‌సీ కె.రామారావు, బాడంగి ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ పి.త్రినాథ్‌కు సేవాపతకాలు ప్రదానం చేస్తామని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్‌గుప్త తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఆర్‌ఎస్‌ఐ వి.కోటేశ్వరరావు, 5వ బెటాలియన్ ఏపీఎస్పీ ఏఆర్ ఎస్‌ఐ బి.ఎస్.వి.ఎస్.వి.మురళీధర్, పార్వతీపురం రూరల్ పీసీ ఎస్.దామోదరరావుకు ఉత్తమ సేవాపతకాలు లభించాయి.

సమష్టిగా పనిచేస్తే సత్ఫలితాలు

- శాఖల మధ్య సమన్వయం అవసరం
- 'ఈ–ఆఫీస్' ఫైళ్లనే పరిశీలిస్తాం
- విధుల్లో సమయపాలన తప్పనిసరి
- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

క్షేత్రస్థాయి ఉద్యోగుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు విధుల్లో సమయపాలన పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉన్నప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమం ఏదైనా సమష్టిగా పనిచేస్తేనే ఆశించిన ఫలితాలను సాధించగలమన్నారు. విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. పరిపాలనా పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎదురయ్యే కోర్టు కేసుల్లో ఆయా శాఖల అధికారులు సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇ–ఆఫీస్ విధానంలో వచ్చిన ఫైళ్లనే పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు

భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి
మే 3న శంకుస్థాపన

- రూ.4,600 కోట్లతో జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం
- అంతర్జాతీయ చిత్రపటంలోకి భోగాపురం ముఖచిత్రం
- శంకుస్థాపన చేసేది మేమే... ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించేదీ మేమే
- మూడేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఒప్పందం
- కేంద్ర మాజీమంత్రి అశోక్‌గజపతిరాజువి మాయమాటలు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి, ప్రజల కలను నెరవేర్చడమే లక్ష్యంగా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మే 3వ తేదీన శంకుస్థాపన చేస్తారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. రూ.4,600 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయటంతో పాటు ప్రారంభోత్సవాన్ని తమ ప్రభుత్వ హయాంలోనే చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో భోగాపురం ముఖచిత్రం అంతర్జాతీయ చిత్రపటంలోకి చేరనుందని హర్షం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూములు త్యాగం చేసిన 404 రైతు కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.76.44 కోట్ల వ్యయంతో పునరావాసం కల్పించడం పూర్తయిందన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్వహణకు అవసరమయ్యే తాగునీటిని తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా చేస్తామని, దీనిలో భాగంగా ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.195 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన ఎయిర్‌పోర్ట్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన వారందరికీ ఉమ్మడి జిల్లాల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాసితులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని చెప్పారు.

ఆరోగ్యకర రాజకీయ విమర్శలు అవసరం

భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులపై ఇప్పటికీ కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయాలనుకోవడం తగదని జెడ్పీ చైర్మన్ అన్నారు. కేంద్ర పౌరవిమానయాన మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో చేయలేని పనిని జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేయడం ఆయనకు మింగుడుపడడం లేదని వాఖ్యానించారు. స్వలాభం కోసం ఎయిర్‌పోర్టు పేరిట భోగాపురం ప్రాంతంలో 5000 ఎకరాల సేకరణకు చంద్రబాబు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తే, అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి 2,000 ఎకరాలు సరిపోతుందని, రైతులకు అన్యాయం జరగకుండా తాము అండగా ఉంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. అప్పట్లో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించిన రైతులు, ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులను చేస్తూ కేసులు పెట్టారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం వచ్చాక వాటిని విత్‌డ్రా చేసినట్టు వివరించారు. ప్రజలందరి ఆమోదంతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని, గడిచిన 4 ఏళ్లతో ఒక్కరిపై కేసులు పెట్టిన దాఖలాలు లేవన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎయిర్‌పోర్టు కోసం సేకరించిన 2,700 ఎకరాల భూమిలో 2,203 ఎకరాలను ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ కార్పొరేషన్ పేరిట బదలాయించగా.. మిగిలిన భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందన్నారు. 2,203 ఎకరాలను జీఎంఆర్ సంస్థకు 40 సంవత్సరాల లీజుకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు పూర్తయితే జీఎంఆర్‌సంస్థ అక్కడి నుంచి ప్రయాణించే ప్రతి ప్రయాణికుని లెక్కగా రూ.313 మొత్తాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా ఒప్పందం కుదిరిందన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములు విక్రయించేస్తున్నట్టు అశోక్‌గజపతిరాజు ప్రచారం చేయడం సబబుకాదన్నారు. అమరావతిలో రైతుల నుంచి సేకరించిన భూములను చంద్రబాబు విక్రయించిన సమయంలో అశోక్‌గజపతిరాజు ఎందుకు వ్యతిరేకించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చేయని దానికి ఆపాదిస్తూ... చేసిన దానిని ఖండించకపోవడం ఆరోగ్యకరమైన రాజకీయం అనిపించుకోదని హితవుపలికారు. మూడేళ్లపాటు కేంద్రమంత్రిగా పని చేసిన అశోక్‌గజపతిరాజు జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. తోటపల్లి కోసం మాట్లాడుతున్న మరో మాజీ మంత్రి కళా వెంకటరావు వాఖ్యలను మజ్జి శ్రీనివాసరావు ఖండించారు. 2014 ఎన్నికలకు ముందు 80 శాతం పూర్తి చేసిన తోటపల్లి పనులను అంతా తామే చేసినట్లు ప్రారంభించారని, ఆ 5 ఏళ్లలో మిగిలిన 20 శాతం పనులు ఎందుకు చేపట్టలేకపోయారో ప్రజలకు తెలియజెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, చనుమల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి మే 3న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా అధికారులు, ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. భూసేకరణ దాదాపుగా పూర్తయిందని, పునరావాసం కల్పన కూడా పూర్తయినట్టు జేసీ మయూర్ అశోక్ కలెక్టర్‌కు వివరించారు. శంకుస్థాపన ఏర్పాట్లు వివరాలను జీఎంఆర్ సంస్థ ప్రాజెక్టు హెడ్ రామరాజు వివరించారు. సమావేశంలో ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, భోగాపురం తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, రోడ్లు భవనాలశాఖ ఈఈ రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ర్యాలీలో పాల్గొన్న నిరుద్యోగులు

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరీష్, రుద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి గురువారం స్థానిక కోట జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరి జంక్షన్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, రాము, సౌమ్య, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్లో పోక్సో కేసు నమోదు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైనట్లు దిశ డీఎస్పీ హర్షిత తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా, బాలికకు వైద్య సేవలందించిన వైద్యులు అందించిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కురుపాం మండలానికి చెందిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుక్కల దాడిలో 10 మేకపిల్లల మృతి

బలిజిపేట: మండలకేంద్రంలో కుక్కల దాడిలో 10మేకపిల్లలు మృతి చెందాయి. గ్రామంలో గొల్లవీధికి చెందిన ఎం.సన్యాసి తన మేకపిల్లలను ఇంటి సమీపంలో ఉన్న శాలలో ఉంచాడు. బుధవారం రాత్రి 4కుక్కలు వాటిపై దాడిచేయడంతో అవి మృతి చెందినట్టు బాధితుడు తెలిపారు. సుమారు రూ.60వేల వరకు నష్టం జరిగిందని వాపోయాడు. పశువులపై కూడా కుక్కలు దాడి చేస్తున్నాయని, అధికారులు, పంచాయతీ పాలకులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండిళ్లు దగ్ధం

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలో షార్ట్ సర్క్యూట్‌తో పతివాడ తిరుపతిరావుకు చెందిన రెండు వరుస ఇళ్లు కాలిపోయాయి. ఈ ప్రమాద సమాచారం అందిన వెంటనే పట్టణ అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో తన కుమార్తెకు చెందిన సర్టిఫికెట్లు, రూ.40వేల నగదు, 12 ధాన్యం బస్తాలు కాలిపోయాయని ఫిర్యాదులో తిరుపతిరావు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పురిటిపెంటలో ధాన్యం పురి..

గజపతినగరం: మండలంలోని పురిటి పెంటలో ధాన్యం పురి, పశువుల శాల కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన బీడీ, సిగరెట్ అంటుకోవడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్, స్థానిక పెద్దలు అభిప్రాయ పడ్డారు. గ్రామానికి చెందిన దాసరి సన్ని తాత పశువుశాల, ధాన్యం పురి ఈ ప్రమాదంలో కాలిపోయాయి.

నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం స్వాధీనం

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో ఓ వ్యాపారి గొడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం, కురుపాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీకాకుళం ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాలమేరకు కురుపాంలోని రావాడ కూడలిలో వ్యాపారి నాగేశ్వరరావు అక్రమంగా నిల్వ ఉంచిన 1540 కేజీల(28బస్తాలు) పీడీఎస్ బియ్యం పట్టుకుని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వాటి విలువ రూ.58 వేల 520 ఉంటుందని తెలిపారు. సదరు వ్యాపారిపై కేసునమోదు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ దాడుల్లో కురుపాం వీఆర్‌ఓ మెరకయ్య, వీఆర్‌ఏ గరుగుబిల్లి ఈశ్వరరావులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఆయా ప్రమాదాలపై మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

డెంకాడ: మండలంలోని రఘుమండ శివాలయం సమీపంలో టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి గోతిలో పడిపోవడంతో పూసపాటి రేగ మండలంలోని పిట్టపేటకు చెందిన పిట్టా అప్పన్న(55) మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. బొడ్డవలసలో పండుగ చూసుకుని స్వగ్రామమైన పిట్టపేటకు టీవీఎస్‌పై అప్పన్న వెళ్తుండగా మార్గమధ్యంలో రఘుమండ వద్ద అదుపు తప్పి గోతిలో పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పైడిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

వడదెబ్బతో వేతనదారు..


పరామర్శిస్తున్న ఏపీఓ రామకృష్ణ


సత్యవతి(ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని నాగూరుకు చెందిన ఎచ్చర్ల పార్వతి(46) వడదెబ్బకు గురై మృతి చెందింది. గురువారం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులలో ఆమె పాల్గొంది. పనులు ముగించుకుని 11 గంటలకు ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందినట్లు భర్త సత్తిశెట్టి తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీఓ రామకృష్ణ నాగూరు వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ. 50వేలు ఎక్స్‌గ్రేషియో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కె.శిరీష తదితరులు అధికారులను కోరారు.

గుండెపోటుతో కలాసీ..


భామిని: పీహెచ్‌సీలో విలపిస్తున్న కుటుంబసభ్యులు

భామిని: మండల కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాంలో గురువారం బియ్యం బస్తాలు దించుతున్న తరుణంలో జట్టు కలాసీ ఆనంద్ గౌడో(38) అకస్మాత్తుగా కింద పడి మృతి చెందాడని సాటి కలాసీలు విలపిస్తూ తెలిపారు. కింద పడిన కలాసీ ఆనంద్ గౌడోను దగ్గరలోని భామిని పీహెచ్‌సీకి తీసుకు వెళ్లినప్పటికే ఊపిరి ఆగిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కాట్రగడ-బి గ్రామానికి చెందిన మృతుడు అనంద్‌గౌడో కొద్ది నెలలుగా భామిని ఎఫ్‌సీఐ గొదాంలో కలాసీగా పనిచేస్తున్నాడు.వైద్యుల నిర్ధారణ అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం కాట్రగడ తరలించారు, మృతుడికి భార్య భానుగౌడో, ముగ్గురు పిల్లలున్నారు.

వేగవంతంగా రీ సర్వే ప్రక్రియ

- సీసీఎల్‌ఏ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేశామని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న రీ సర్వే ప్రగతిపై రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ జి.సాయిప్రసాద్ గురువారం విజయవాడలోని సీసీఎస్‌ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో వెబ్‌ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాలు ప్రింటింగ్, హద్దురాళ్ల పాతడం, జీసీపీ మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్ 13 నోటిఫికేషన్‌ల ప్రగతి తదితర అంశాలలో కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో హద్దురాళ్ల పాతడం, ఖాతాలకు ఫొటోమ్యాపింగ్ తదితర ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రీ సర్వేకు సంబంధించి ఆయా పనులను లక్ష్యం మేరకు నిర్దిష్ట కాల పరిమితితలోగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, సర్వే శాఖ ఎ.డి త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న రూ.3 లక్షలు బాధితులకు అందజేత


నగదు అందిస్తున్న సీఐ శ్రీనువాసరావు

సాలూరు: బ్యాంకులో విత్‌డ్రా చేసిన డబ్బులు మార్గ మధ్యంలో పోగొట్టుకున్న బాధితురాలికి పోలీసులు గురువారం నగదు అందించారు. దీనిపై పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అఫీషియల్ కాలనీకి చెందిన శాంతకుమారి బుధవారం ఎస్‌బీఐలో రూ.3 లక్షలు విత్‌డ్రా చేసుకుని ఇంటికి పయనమైంది. ఇంటికి వెళ్లిన తరువాత ఆమె దగ్గర డబ్బుల బ్యాగు లేకపోవడంతో పోయాయని గ్రహించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు మార్గమధ్యంలో ఆమె పొగొట్టుకున్న నగదును గుర్తించి గురువారం అందజేశారు. పోయిన డబ్బు మళ్లీ చేతికి అందడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఎస్సైలు పాపారావు, నారాయణలు ఉన్నారు.

టెన్నిస్ పోటీల్లో జిల్లా వెటరన్స్ సత్తా


విశాఖలో జరిగిన టెన్నిస్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా వెటరన్స్ క్రీడాకారులు

విజయనగరం: విశాఖ వేదికగా జరిగిన ఆలిండియా టెన్నిస్ పోటీల్లో జిల్లా వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు విశాఖలోని సెంచరీ క్లబ్‌లో జరిగిన వెటరన్స్ పోటీల్లో 45 సంవత్సరాల వయస్సు విభాగంలో సింగిల్స్‌లో పోటీపడిన టి.రామారావు హైదరాబాద్‌కు చెందిన డి.సతీష్‌బాబుపై విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే డబుల్స్ విభాగంలో టి.రామారావు-ఎంవీఎల్ఎన్ రాజులు ద్వితీయ స్థానంలో నిలిచారు. 35 సంవత్సరాల వయస్సు విభాగంలో డబుల్స్‌లో పోటీ పడిన సుదర్శన్‌రాజు, కె.భానుచంద్రలు మహారాష్ట్ర జట్టుపై విజేతగా నిలిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు.

కెమికల్ ఇంజినీరింగ్‌లో మంచి అవకాశాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్ బి.వి.రవికుమార్

డెంకాడ: కెమికల్ ఇంజినీరింగ్‌లో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని భారత ప్రభుత్వంలోని ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్ బి.వి.రవికుమార్ అన్నారు. ఈ మేరకు చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కెమికల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్టూడెంట్ సింపోజియంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పెట్రో కెమికల్స్, ఫార్మా ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీవేద కన్సల్టెన్సీ సీఈవో చైతన్య వర్మ, సహభాగస్వామి రామునాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, కన్వీనర్ బి.సర్వారావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వధార్ హోం నుంచి ఇద్దరు అమ్మాయిల పరారీ

- కేసు నమోదు చేసిన పోలీసులు


స్వధార్‌హోం సూపరింటెండెంట్ కమలతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని స్వధార్ హోంలో ఉంటున్న ఇద్దరు అమ్మాయిలు పరారయ్యారు. వారిలో ఒకరు మైనర్ కాగా, మరొకరు మేజర్. నిరాదరణకు గురైన మహిళలకు స్వధార్ హోంలో రక్షణ, సంరక్షణ కల్పిస్తారు. ఫిబ్రవరి 24 వతేదీన బాలల సంక్షేమ కమిటీ వారు విజయనగరానికి చెందిన 17 ఏళ్ల బాలికకు తాత్కాలిక పునరావాసం కల్పించాలని స్వధార్ హోం నిర్వాహకులను ఆదేశించారు. దీంతో ఆ బాలిక అప్పటి నుంచి స్వధార్ హోంలో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన 19 ఏళ్ల యువతి మార్చి 31వ తేదిన స్వధార్ హోంలో చేరింది. వారిద్దరూ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో స్వధార్ హోంలో వారు ఉంటున్న గది కిటికీ వంచి పరారయ్యారు. దీంతో స్వధార్ హోం సూపరింటెండెంట్ కమల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వధార్ హోం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈసంఘటన జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని స్వధార్ హోం సూపరింటెండెంట్ కమల వద్ద సాక్షి ప్రస్తావించగా అమ్మాయిలిద్దరు నవ్వుతూ ఉండేవారని, ఎందుకు వెళ్లిపోయారో తెలియడం లేదన్నారు.

పరిశీలించిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్

బాలికలు పరారైన విషయం తెలుసుకున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు గురువారం స్వధార్ హోంను పరిశీలించారు. సంఘటన గురించి ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాలు తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు.

నగదుచోరీ నిందితుడి అరెస్ట్

- మరో ముగ్గురు పరారీ
- రూ.7 లక్షలు రికవరీ చేసిన సీసీఎస్ పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజు

విజయనగరం క్రైమ్: మోటార్ బైక్ డిక్కీలో పెట్టుకున్న డబ్బును చోరీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న నలుగురు వ్యక్తులలో ఒకరిని సీసీఎస్ పోలీసులు పట్టుకుని రూ.7 లక్షల నగదు రికవరీ చేశారు. ఈ మేరకు సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజు గురువారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా రాజాం, కొత్తవలస పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బైక్ డిక్కీల నుంచి నగదు చోరీకి పాల్పడిన నలుగురు ముఠా సభ్యుల్లో చిత్తూరు జిల్లా ఓజికుప్పం గ్రామానికి చెందిన 70 ఏళ్ల కేజీ సుబ్రహ్మణ్యాన్ని సీసీఎస్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా సభ్యులు బ్యాంకులో కస్టమర్లుగా వ్యవహరిస్తూ, బ్యాంక్ లావాదేవీలు చేస్తున్న వ్యక్తులను గమనించి, నగదు డ్రా చేసి, మోటారు బైక్ డిక్కీలో పెట్టుకునే వారిని టార్గెట్ చేసి, ఎక్కడైనా ఏదైనా పనిమీద వారు ఆగినప్పుడు వెంటనే తమ చేతులకు పనిచెప్పి, నగదు కాజేస్తారు. ఇదే తరహాలో రాజాం, కొత్తవలస పట్టణాల్లో నేరాలకు పాల్పడ్డారు. మిగిలిన ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామమని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీసీఎస్ ఎస్సై సాగర్‌బాబు, హెచ్‌సిలు ఎం.డి. ఇమ్రాన్, దాసరి శంకరరావు, రాజాం కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కొత్తవలస కానిస్టేబుల్ గౌరినాయుడులను సీసీఎస్ సీఐ అభినందించారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు మంచి స్పందన

- 108, 104 జోనల్ మేనేజర్ కె. గణేష్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని 108, 104 అరబిందో సర్వీసెస్ సంస్థ జోనల్ మేనేజర్ కె.గణేష్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణంలో ఉన్న 108, 104 కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి విజయనగరం జిల్లాకు 32 వాహనాలను అందించందని తెలిపారు. ఈ వాహనాల్లో పనిచేయడానికి సిబ్బందిని కూడా నియమించామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో వాహనం వద్ద 60 నుంచి 70 మంది రోగులను పరీక్షిస్తున్నారని తెలిపారు. రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో 108 ఉమ్మడి విజయనగరం జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, పార్వతీపురం మన్యం 104 జిల్లా మేనేజర్ పూసర్ల వెంకట దుర్గప్రసాద్, 104 విజయనగరం జిల్లా మేనేజర్ బైరెడ్డి వినోద్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ సంతోష్, రవి పాల్గొన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు


లక్ష్మణరావును సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్తున్న 108 సిబ్బంది

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి-సుభద్రాపురం ప్రధాన రహదారిలో పుర్రేయవలస జంక్షన్ వద్ద ఓ కారు అదుపు తప్పి సమీపంలో ఉన్న దుకాణంలోకి దూసుకుపోయింది. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ జీవీ రమణ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. చీపురుపల్లికి చెందిన మజ్జి భాస్కరరావు తన కారులో శ్రీకాకుళం వెళ్తుండగా పుర్రేయవలస జంక్షన్ వద్ద కారు అదుపు తప్పి, అదే సమయంలో బైక్‌పై చీపురుపల్లి పట్టణం వైపు వెళ్తున్న పుర్రేయవలసకు చెందిన గురాన లక్ష్మణరావు, కుమారుడు హర్ష(బాలుడు)ను ఢీకొట్టాడు. అదే సమయంలో నడుచుకుంటూ వస్తున్న వృద్ధుడు నిద్దాన సత్యాన్ని ఢీకొని సమీపంలో మూసి ఉన్న దుకాణంలోకి కారు దూసుకుపోయింది. ఈ ఘటనలో లక్ష్మణరావు ఎడమ చెయ్యి విరగడంతో విజయనగరం సర్వజన ఆస్పత్రికి 108లో తీసుకువెళ్లారు. నిద్దాన సత్యం కుడికన్ను, కుడి మోకాలికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాసులు నాయుడు పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

బతుకు వేటకు బ్రేక్..!

- జూన్ 14 వరకు చేపల వేట నిషేధం
- సముద్రంలో మత్స్య సంపదను కాపాడేందుకు నిషేధాజ్ఞలు జారీ
- మత్స్యకారులకు భృతి అందించేందుకు ప్రభుత్వం చర్యలు


తీరంలో నిలిచిన బోట్లు

పూసపాటిరేగ/భోగాపురం: సాగరంలో జలసంపదను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి సంవత్సరం లాగానే చేపలు గుడ్లు పెట్టే సమయం ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు ప్రభుత్వం వేటపై నిషధాజ్ఞలు జారీచేసింది. ఈ సమయంలో ఉపాధి కోల్పోనున్న మత్స్యకారులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తూ మత్స్యభరోసా పథకం ద్వారా ఆదుకుంటోంది. గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మత్స్యకారులను పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంవత్సరం మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో మత్స్యభరోసా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.10 వేలు సాయాన్ని అందిస్తుండంతో గంగపుత్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 15,138 మంది మత్స్యకారులు

జిల్లాలోని తీర ప్రాంత మండలాలు పూసపాటిరేగ, భోగాపురంలో 14 సముద్రతీర మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 15,138 మంది మత్స్యకారులు ఉన్నారు. వారిలో4 వేల నుంచి5 వేల మంది మత్స్యకారులు నిరంతరం సముద్రంలో వేట కొనసాగిస్తుంటారు. రెండు మండలాల్లో 712 మోటార్ బోట్లు, 417 సంప్రదాయ బోట్లకు రిజిస్ట్రేషన్ అయింది. మత్స్య శాఖ అధికారులు మోటార్ బోట్లు, సంప్రదాయ పడవల్లో వేట కొనసాగిస్తున్న 2,635 మంది మత్స్యకారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించారు.

పారదర్శకంగా అమలు



మత్స్యకారులకు మంజూరైన సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నాం. మత్స్య సంపదను వృద్ధి చేసేందుకే ప్రభుత్వం నిషధాజ్ఞాలు విధించింది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు నిబంధనలు ఉల్లంఘించి వేట కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– నిర్మలాకుమారి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, విజయనగరం

ఫుడ్ కమిషన్ సభ్యుడి సుడిగాలి పర్యటన

- రేషన్ షాపులు, సప్లైస్ గోదాముల పరిశీలన
- అటెండెన్స్ వేయని హెచ్ఎం, అంగన్వాడీలకు నోటీసులివ్వమని ఆదేశాలు


ఎంఎల్ఎస్ పాయింట్‌లో పరిశీలిస్తున్న ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

బొబ్బిలి: అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సరఫరా చేస్తున్న గుడ్ల తూకంలో తేడాలపై ఫుడ్ కమిషన్ రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశంలో ప్రస్తావిస్తానని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు యాదవ్ అన్నారు. ఈ మేరకు బొబ్బిలిలో గురువారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ట్రేతో కలిపి గుడ్ల బరువు1530 గ్రాములుండాలన్నారు. చాలా చోట్ల వాటి బరువు తక్కువగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. ముందుగా పట్టణంలోని స్వామివారి వీధిలో గల అంగన్వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న గుడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడ్లను తూకం వేసి 5 గ్రాములు తక్కువ ఉండటంపై కాంట్రాక్టర్‌ను ఫోన్‌లో ప్రశ్నించారు. అలాగే తారకరామా కాలనీలో రేషన్ షాపునకు బోర్డు లేకపోవడంపై ప్రశ్నించారు. అక్కడే ఉన్న మరో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు పెట్టే భోజనాన్ని రుచి చూశారు. హాజరు పట్టీలను పరిశీలించారు.

హెచ్ఎం, అంగన్‌వాడీ వర్కర్‌కు మెమోలు

అనంతరం ఆయన నేతాజీ మున్సిపల్ స్కూల్‌లో ఉన్న మధ్యాహ్న భోజన రికార్డులు పరిశీలించి అవి సరిగా లేకపోవడంతో అక్కడి హెచ్ఎంకు మెమో జారీ చేశారు. అక్కడి అంగన్వాడీ సిబ్బంది కూడా హాజరు పట్టీ సక్రమంగా నిర్వహించకుండా ఖాళీలుంచడంపై మెమోలు జారీ చేశారు. రంగరాయ పురంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడి హాజరు పట్టీలను పరిశీలించారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించి అక్కడ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ స్టాకు వివరాల్లో తేడాలున్నట్టు గుర్తించారు. ఈ గణాంకాలను సరిచేయాలని జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాస్తామన్నారు. అలాగే కస్తూరిబా గాంధీ పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఎస్‌డీటీలు కొట్నాన శ్రీనివాసరావు, ఆర్.సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సాయంత్రం వేళ కస్తూరిబా గాంధీ పాఠశాల నుంచి గిరిజన బాలికల వసతి గృహంలో కాంతారావు యాదవ్ పరిశీలించారు. ఈ పరిశీలనలో 27 బస్తాల బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించిన వెంటనే జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. అక్కడ బియ్యం ఉన్న విషయాన్ని వార్డెన్ దాచి పెట్టే ప్రయత్నం చేశారని ఫోన్‌లో స్పష్టం చేశారు.